క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చేయూతనివ్వండి



డీఆర్ఎం సీఎస్ గుప్తాకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పెన్షనర్లు

గుంతకల్లు: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చేయూత ఇవ్వాలని ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ గుంతకల్లు డివిజన్ నాయకులు డీఆర్ఎం సీఎస్ గుప్తాకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఫెడరేషన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి మస్తాన్‌వలి, సాయిశేఖర్, కరీమ్‌బాషా, కనకరాజు, నాగరాజు, ఖాజఖాన్, అశోక్, వెంకటేష్, వీరేష్ తదితరులు డీఆర్ఎం సీఎస్‌గుప్తాను శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే పెన్షనర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఆర్ఎంకు వివరించారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



విజయకుమార్

శింగనమల : శింగనమల ఎస్ఐగా విజయకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం రైల్వే (జీఆర్పీ)లో ఎస్ఐగా పని చేస్తుండేవారు. అక్కడి నుంచి శింగనమల పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ శరత్‌చంద్ర వీఆర్‌కు వెళ్లారు. ఎస్ఐ విజయకుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అనంతరం సీఐ కౌలుట్లయ్యను కలిశారు.

ఎస్ఐ బదిలీ

పుట్లూరు: మండలంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న హేమాద్రి గురువారం బదిలీ కావడంతో ఆయనను పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈయన తిరుపతి వీఆర్‌కు వెళ్లగా అక్కడి నుంచి వెంకటనరసింహాన్ ఇక్కడికి బదిలీ అయ్యారని పోలీసులు తెలిపారు. కాగా బదిలీపై వెళ్లిన హేమాద్రిని పూలమాలతో సన్మానించి ఆయన సేవలను సిబ్బంది కొనియాడారు.

గ్రామసభ వాయిదా

శింగనమల: నార్పల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభకు ప్రజలు హాజరు కానందున వాయిదా వేశామని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యామల తెలిపారు. గ్రామసభ తిరిగి 4వ తేదీ నిర్వహిస్తామన్నారు.

నేడు మండల సమావేశం

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శకుంతల గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరగనున్న సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

యాడికి సర్వేయర్‌కు గాయాలు



గాయపడిన సర్వేయర్ సుంకన్న

గుత్తి: పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో యాడికి మండల సర్వేయర్ సుంకన్న తీవ్రంగా గాయపడ్డాడు. సుంకన్న బైక్‌లో వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడ్డాడు. హైవే పెట్రోల్ పోలీసులు గమనించి సుంకన్నను గుత్తి ఆస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురానికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.


ఉపాధి పనుల తనిఖీ



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

యల్లనూరు: మండలంలోని నిట్టూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ వాసుదేవ రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీ పనులకు వచ్చేటట్లు అవగాహన కల్పించాలన్నారు. పనుల వద్ద ప్రతి రోజూ మస్టర్లు వేయాలని, పనుల వద్ద ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ కౌలుట్లయ్య

శింగనమల: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సీఐ కౌలుట్లయ్య సూచించారు. గురువారం నార్పలలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. ఆయన వెంట ఎఎస్ఐ నాగరాజు, కానిస్టేబుల్ సుంకన్న తదితరులు ఉన్నారు.

క్రీడా వికాస కేంద్రానికి మోక్షమెప్పుడు?



గోడలకు పరిమితమైన ఇండోర్ స్టేడియం

- అసంపూర్తిగా ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రీడాప్రాధికారక సంస్థ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన క్రీడా వికాస కేంద్రం(ఇండోర్ స్టేడియం) పనులు ఏడేళ్లయినా పూర్తికాలేదు. క్రీడాకారులకు అండగా నిలిచి వారి కలలను సాకారం చేసేందుకు గానూ క్రీడావికాస కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని గొప్పలు చెప్పి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు విదల్చని కారణంగా నిర్మాణ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. వాస్తవానికి శాప్ (క్రీడా ప్రాధికారక సంస్థ) ఆధ్వర్యంలో చేపట్టిన క్రీడావికాస కేంద్రం పనులు 2018, జనవరి 29న ప్రారంభమయ్యాయి. ఈ పనుల పర్యవేక్షణను ఏపీ హౌసింగ్ శాఖకు అప్పగించారు. పనులు 2018, జూలై 30 నాటికి పూర్తికావాల్సి ఉన్నా నేటికీ పూర్తి చేయలేదు. నిర్మాణ పనులన్నీ మొండిగోడలకే పరిమితమయ్యాయి. గుంతకల్లులో క్రీడాకారులకు కొదువ లేదు. వివిధ క్రీడల్లో సత్తా చాటేందుకు ఇక్కడి వారు ఉరకలేస్తుంటారు. వారు సాధన చేసేందుకు అనువైన ఇండోర్ స్టేడియం లేనందున తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు చొరవ తీసుకుని క్రీడా వికాసానికి దోహదపడాలని క్రీడాకారులు కోరుతున్నారు. కాగా ఇప్పటివరకు ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.కోటి ఖర్చుచేసి 70 శాతం పనులు పూర్తి చేసినా ప్రభుత్వాలు ఒక్కపైసా కూడా బిల్లు మంజూరు చేయలేదని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. రూ.2 కోట్ల అంచనా వ్యయం కాగా రూ.1.47 కోట్లకు అగ్రిమెంట్ జరిగిందని, ఇప్పటి వరకు చేసిన పనులకు వెచ్చించిన సొమ్ముకు వడ్డీ కట్టలేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. బిల్లులు చెల్లిస్తే పనులు పూర్తిచేయిస్తానని ఆయన వెల్లడించారు.

నిర్మాణం పూర్తి చేయించాలి



క్రీడాకారుల సౌకర్యార్థం నిర్మించ తలపెట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. ఎలాగో అదే స్కూల్ ఆవరణలో ఆర్‌డీటీ క్రికెట్ కోచింగ్ క్యాంప్‌ను నిర్వహిస్తోంది. ఈ ఇండోర్ స్టేడియం కూడా పూర్తి చేసినట్లయితే ఎంతో మంది క్రీడాకారులను తయారు చేయవచ్చు.

–పీ.కరీమ్‌ఖాన్, ఎస్‌జేసీపీ హైస్కూల్ కాలనీవాసి, గుంతకల్లు

క్రీడాకారులను ప్రోత్సహించాలి



అర్ధంతరంగా ఆగిపోయిన క్రీడా వికాస కేంద్రం పనులను పూర్తి చేసి ఆ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలి. గ్రామీణ ప్రాంతాల్లో మెరికల్లాంటి క్రీడాకారులున్నా వారు శిక్షణ తీసుకోవాలంటే డబ్బు చెల్లించి కోచింగ్‌కు వెళ్తుంటారు. క్రీడల్లో ప్రతిభావంతుల్ని ప్రోత్సహించేందుకు గానూ పనులు పూర్తి చేయించి క్రీడా ప్రగతికి ప్రభుత్వం పాటుపడాలి.

– ప్రదీప్ ఆచారి, క్రీడాభిమాని, గుంతకల్లు

తాడిపత్రిలో 'కాసం' ఫ్యాషన్స్ ప్రారంభం



కాసం ఫ్యాషన్ మాల్‌లో నిర్వాహకులతో కలిసి జ్యోతిని వెలిగిస్తున్న నటి అనసూయ

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలో సినీ నటి, జబర్దస్త్ యాంకర్ అనసూయ సందడి చేశారు. గురువారం నంద్యాల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కాసం ఫ్యాషన్స్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి అనసూయ ముఖ్యతిథిగా హాజరై నిర్వాహకులతో కలిసి జ్యోతి వెలిగించి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అధునాతన కలెక్షన్స్‌తో నిత్య నూతన వెరైటీలతో కాసం ఫ్యాషన్స్ పేరుగాంచిందన్నారు. ఈ బ్రాంచ్‌ను తాడిపత్రిలో తాను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం మాల్‌లోని లేడీస్, జెంట్స్, కిడ్స్ వేర్‌ను వస్త్రాలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా షాపింగ్ మాల్ డైరెక్టర్స్ కాసం నమః శివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో నాలుగు సంవత్సరాలుగా ప్రజలు మన్ననలు పొందుతూ ఇప్పటి వరకు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో 15 బ్రాంచ్‌లు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, అభిమానులు ఆమెతో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. అనసూయను చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు పెద్ద ఎత్తున రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాసం ఫణి, కాసం సాయిక్రిష్ణ, కాసం ధీరజ్, డాక్టర్ కాసం ప్రీతం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

గుత్తి రూరల్/పుట్లూరు: గుత్తి మండలంలోని శ్రీపురం, అనగానదొడ్డి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సదస్సులకు తహసీల్దార్ ఓబులేసులు హాజరై రైతులతో వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలింగమయ్య, వీఆర్ఓలు సురేంద్ర, కిశోర్, అనురాధ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పుట్లూరు మండలంలోని ఓబుళాపురం గ్రామంలో దళితుల భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్య తదితరులు తహసీల్దార్ శేషారెడ్డికి వినతి పత్రం అందించారు. దళితుల పేరుపై ఉన్న భూములను గ్రామంలోని పెత్తందారులు ఇష్టారాజ్యంగా మార్పులు చేయించి తగాదాలను సృష్టిస్తున్నట్లు అధికారులతో వాపోయారు.

పాఠశాలను అభివృద్ధి చేయండి



మాట్లాడుతున్న ఎంఈఓలు

యల్లనూరు: ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాలను అభివృద్ధి దిశగా నడపాలని ఎంఈఓలు చంద్రోశేఖర్, పరమేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధి విషయంలో అందరూ కృషి చేయాలన్నారు. అలాగే ప్రణాళికలు రూపొందించుకుని పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో మీటింగు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బంగారు దుకాణంలో చోరీకి యత్నం

శింగనమల: నార్పలలోని బంగారం దుకాణంలో చోరీకి ప్రయత్నించిన మహిళను దుకాణదారుడు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గురువారం ఉదయం కమ్మలు కొనుగోలు చేయడానికి వచ్చిన నార్పల మండలం గడ్డం నాగేపల్లికి చెందిన ఓ మహిళ.. దుకాణదారుడిని ఏమార్చి బంగారు కమ్మలను తస్కరించి, వాటి స్థానంలో గిల్టు నగలు ఉంచింది. గుర్తించిన దుకాణ నిర్వాహకుడు సయ్యద్ ఆమెను పోలీసులకు అప్పగించాడు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'చర్యలు తీసుకోండి'

తాడిపత్రి రూరల్: కొంతమంది ఎస్సీలను బీసీ జాబితాలో చేర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం కమిషనర్ శివరామక్రిష్ణకు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం అందించారు. పట్టణంలోని 36వ వార్డులోని సచివాలయానికి వెళ్లి జాబితాను పరిశీలించగా అధికారుల నిర్లక్ష్యం బయట పడిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాడిపత్రి నియోజక వర్గ ఇన్‌చార్జ్ రవిమాదిగ, సీనియర్ నాయకులు పెద్దిరాజు, రాష్ట్ర మహిళ నాయకురాలు లక్ష్మీదేవి, దేవి తదితరులు ఉన్నారు.

కిశోర వికాసం శిక్షణ తరగతుల ప్రారంభం



కిశోర వికాసం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

తాడిపత్రి అర్బన్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో కిశోర వికాసం మండల స్థాయి శిక్షణ తరగతులను కమిషనర్ శివరామక్రిష్ణ, డీఎస్పీ రామకృష్ణుడు ప్రారంభించారు. కమిషనర్ శివరామకృష్ణ మాట్లాడుతూ కిశోరి వికాసం పునః ప్రారంభం రాష్ట్రంలోని ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరిచేందుకు ఓ మంచి అవకాశమన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ 11–18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదాబేగం, వైద్యాధికారి సుమన్, ఎంపీడీఓ ఫాజల్‌బాషా, పెద్దపప్పూరు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్, ఎంఈఓ నాగరాజు, ఏపీఎం వీరాస్వామి, ఆర్టీటీ ఏటీఎల్ లలిత, మెప్మా సీఎంఎం తులసి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాలెండర్లు, డెయిరీల ఆవిష్కరణ



గుత్తిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నేతలు



గార్లదిన్నెలో ఏపీటీఎఫ్ క్యాలెండర్ విడుదల చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గురువారం వేమన రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేమన రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు రాజశేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, తిమ్మారెడ్డి, జయ రాం రెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌యూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

గుంతకల్లు: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) అర్బన్, రూరల్ శాఖ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్, స్టిక్కర్లును గురువారం ఆవిష్కరించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు వాటిని విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నారాయణరెడ్డి, పుండరీకాక్ష, టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌హెచ్‌ఎం కాశీనాథ్, జిల్లా కార్యదర్శి జి.తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో గురువారం ఏపీటీఎఫ్ 2025 క్యాలెండర్, డైరీలను ఎంఈఓలు చంద్రనాయక్, వెంకటరమణనాయక్ చేతుల మీదుగా ఉపాధ్యాయ సంఘం నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం సుంకన్న, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, వన్నప్ప, పోతులయ్య, మహేష్ కుమార్, ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గురువారం ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా మాట్లాడుతూ మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఎగువపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి 55 సంవత్సరాలు వయస్సు ఉంటుందన్నారు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉందన్నారు.

వైజ్ఞానిక నైపుణ్యం అవసరం



బుక్కరాయసముద్రంలో నమూనాలు పరిశీలిస్తున్న ఎంఈఓ నవీద



గుత్తిలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు



పామిడిలో వైజ్ఞానిక ప్రదర్శనను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ



పుట్లూరులోని ఆదర్శ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన

బుక్కరాయసముద్రం/గుత్తి/యల్లనూరు/పుట్లూరు/పామిడి: విద్యార్థులకు చదువులతో పాటు వైజ్ఞానిక నైపుణ్యాలు ఎంతో అవసరం అని మండల విద్యా అధికారులు నవీద, లింగా నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. సైన్స్‌ఫేర్‌కు కేజీబీవీ, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, విద్యార్థులు హాజరయ్యారు. వీటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈనెల 3న రాప్తాడు మోడల్ స్కూల్‌లో నిర్వహించే సైన్స్ ఫేర్‌లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, నీరజ, ఎన్‌వీఆర్ ప్రసాద్, ఓంకారేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

- గుత్తి పట్టణంలోని మోడల్ స్కూల్లో గురువారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు, ఎంఈఓ రవి నాయక్‌లు మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీపై అవగాహన పెంచుకుని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నైపుణ్యతను సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉష, వైఎస్సార్ టీచర్స్ యూనియన్ జిల్లా నాయకులు శ్రీధర్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
- యల్లనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో మండల స్థాయి సైన్స్ ఫేర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఎంఈఓలు చంద్రోశేఖర్, పరమేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి ప్రారంభించారు. హెచ్‌ఎం రత్నమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పుట్లూరు మండలంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం 8 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సృజనాత్మకతతో చేసిన పలు రకాల ప్రాజెక్ట్‌లను ఎంఈఓలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్ పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పామిడిలోని టీసీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓ జయానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భం రెండు టీసీ హైస్కూల్, ఒకటి మోడల్‌స్కూల్‌లకు సంబంధించి విద్యార్థులు తప్సుం, సుమలత, రమ్య, సుజాత(టీసీ హైస్కూల్, పామిడి), లక్ష్మీనారాయణ(ఏపీ మోడల్‌స్కూల్, పామిడి) ప్రదర్శనలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. హెచ్‌ఎం రామ్‌కుమార్, గైడ్ టీచర్ల రామాంజనేయులు, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ సేవలు మరువలేనివి



ప్రిన్సిపాల్ మహమ్మద్ షఫి దంపతులను సన్మానిస్తున్న అధికారులు

శింగనమల: శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ షఫి సేవలు మరువలేనివని లెక్చరర్లు, అధికారులు కొనియాడారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. సబ్ ట్రెజరీ అధికారి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రిన్సిపాల్ కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నత చదువుకు ఎంతో దోహదపడ్డారన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ దంపతులకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, విద్యార్థులు, వారి తల్లి తండ్రులు పాల్గొన్నారు.

ఇద్దరు ట్రాన్స్‌జెండర్ల గాయాలు

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులో గురువారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ట్రాన్స్ జెండర్లు గాయపడ్డారు. వివరాలు.. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ట్రాన్స్ జెండర్లు అనంతపురానికి కారులో బయలుదేరారు. అయితే మార్గమధ్య(కర్నూలు రోడ్డు)లో కారు టైర్ బరస్ట్ అయింది. దీంతో కారు పక్కకు దూసుకెళ్లి ట్రాన్‌జెండర్లు రేష్మి, లహరి గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరిపై కేసు నమోదు

యాడికి: జొన్న పంటను గొర్రెలు మేసిన ఘటనలో బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన కోడూరు వెంకటరెడ్డి గ్రామ సమీపంలోని పొలంలో జొన్నపంటను సాగు చేశాడు. గురువారం నిట్టూరు కుళ్లాయిరెడ్డి ఆ జొన్న పంట నాదేనని బలరాముడు అనే గొర్రెల కాపరితో జొన్న పంటను మేపాడు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు గొర్రెల కాపరి బలరాముడితో పాటు జొన్నపంటను మేసేందుకు సహకరించిన నిట్టూరు కుళ్లాయిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా దాదాపు రూ.20 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

జూనియర్ అసిస్టెంట్ మృతి



అనిల్ కుమార్ (ఫైల్)

తాడిపత్రి రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అనిల్ కుమార్ (26) గురువారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూలు ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయన మృతికి తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది సంతాపం తెలిపారు.

ఒకరికి గాయాలు

యాడికి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు గాయపడ్డాడు. వివరాలు .. మండల కేంద్రంలో చౌడేశ్వరీ కాలనీకి చెందిన సోమప్ప కుమారుడు నరసింహ(22) ద్విచక్ర వాహనంలో బజారుకు పోతుండగా ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో కుక్క అడ్డు వచ్చింది. దీంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి అతడు కింద పడ్డాడు. ఘటనలో అతడి కంటికి తీవ్ర గాయమైంది. ఓ వాహనంలో కుటుంబ సభ్యులు వెంటనే అతడిని తాడిపత్రిలోని ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వృద్ధుడి మృతి



తాడిపత్రిటౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి(70) మృతదేహాన్ని గురువారం సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. సెల్‌ఫోన్ ఉన్నా...అందులో ఎలాంటి సమాచారం లేదు. కాగా, మృతుడు యాచకుడని స్థానికులు చెబుతున్నారు. ఘటనపై ఎస్ఐ గౌస్‌బాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు తాడిపత్రి అర్బన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం



అనంత వెంకటరామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్

యాడికి: వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు అందరం సమష్టి కృషి చేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఇటీవల దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన దివ్యాంగుడు జి. ఉపేంద్ర గౌడ్ గురువారం అనంతపురంలో వారిని కలసి పూల బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూర్మాజీ పేట గ్రామానికి చెందిన అంజి, రంగా, భాష, నరసింహా రెడ్డి తదితరులు ఉన్నారు.